సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 24 । నవంబర్ । 2024



కార్తీకదీపాలు.. కోడెమొక్కులు

వేములవాడ: రాజన్నకు భక్తుల ఒక వైపు కార్తీక దీపాలు వెలిగిస్తూనే మరో వైపు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. శనివారం దాదాపు 40వేల మంది దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.50 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. రాజన్నను హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యస్వామి దర్శించుకున్నారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ విస్తరణపై శృంగేరి పీఠాధిపతులు సూచించిన నమూనాలు వివరించారు.

ఉద్యోగం వదిలి.. సాగుకు కదిలి

డిగ్రీ, పీజీ వంటి ఉన్నత చదువులు చదివారు.. ఉద్యోగం రాలేదా అంటే.. మంచి ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు ఉద్యోగాలు వచ్చాయి.. కొన్నేళ్లు పని చేశారు.. కానీ, నెలవారీగా జీతం తీసుకునే ఆ జీవితం వారికి సంతృప్తినివ్వలేదు.. ఏం చేస్తే బాగుంటుందని తీవ్రంగా ఆలోచించారు.. అలా.. పలువురు వ్యవసాయం, కోళ్ల పెంపకం వైపు కదిలారు.. పంటలు పండిస్తూ, కోళ్లను పెంచుతూ ఆదాయం పొందుతూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. ఈ పనుల్లోనే మజా ఉందని చెబుతున్నారు పలువురు ఉమ్మడి జిల్లావాసులు. వారిపై స్పెషల్ స్టోరీ.

సండే స్పెషల్

- సంతృప్తినివ్వని సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు ఉద్యోగాలు
- కోళ్ల పెంపకం, వ్యవసాయం చేస్తున్న పలువురు పట్టభద్రులు
- ఈ పనుల్లోనే మజా ఉందంటున్న వైనం
- ఆదర్శం.. ఉమ్మడి జిల్లావాసులు

కోడిపిల్లల ఉత్పత్తికి ఇంక్యుబేటర్

రామగుండం: అంతర్గాం మండలంలోని రాయదండికి చెందిన పల్లె రాజుది నిరుపేద కుటుంబం. 2016లో ఉస్మానియా క్యాంపస్‌లో ఎంకాం చదివాడు. కొన్ని నెలలపాటు ప్రైవేటు ఉద్యోగం చేశాడు. దానితో సంతృప్తి చెందలేదు. సొంతంగా ఏదైనా పని చేసి, యువతకు ఉపాధి కల్పించాలనుకున్నాడు. 2017లో స్వగ్రామంలోనే అగ్రి గ్రీన్ ఫామ్స్ పేరిట తొలుత 10 కోళ్లు, 2 పుంజులతో నాటుకోళ్ల పెంపకం ప్రారంభించాడు. కృత్రిమంగా 2 వేల కోడిగుడ్ల నుంచి కోడిపిల్లలను ఉత్పత్తి చేసేలా ఇంక్యుబేటర్‌కు రూపకల్పన చేశాడు. తర్వాత నాటుకోడి పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించాడు. 2018 నుంచి కోళ్ల ఫాంలు పెట్టుకునే రైతులను ప్రోత్సహిస్తూ శిక్షణనిస్తున్నాడు. రాజు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఐదుసార్లు ఉత్తమ యువ పౌల్ట్రీ రైతు అవార్డులతోపాటు 3 జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నాడు. ఇప్పటివరకు దేశంలోని 19 రాష్ట్రాలకు నాటు కోడి పిల్లలు సరఫరా చేశాడు. 5 దేశాలకు నాటు కోడి పచ్చడి ఎగుమతి చేస్తున్నాడు. కడక్‌నాథ్, తెల్లరంగు చీమ, టర్కీ కోళ్లు, ఖజానా బాతులు, అమెరికన్ సిల్కీ కోళ్లు, కుందేళ్లు, అమెరికన్ జాతి పావురాలు, జర్మన్ షెఫర్డ్ కుక్కలు పెంచుతున్నాడు.



రాజు(మధ్యలో ఉన్న వ్యక్తి)ను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ (ఫైల్)

వరి, మొక్కజొన్న, పత్తి సాగు



మొక్కజొన్న చేనులో వరుణ్‌రెడ్డి

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేటకు చెందిన బద్దం వరుణ్‌రెడ్డి 2009లో ఎంసీఏ పూర్తి చేశాడు. తొమ్మిదేళ్లు హైదరాబాద్, బెంగళూరు, పుణేల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. వ్యవసాయంపై ఆసక్తితో సాఫ్ట్‌వేర్ రంగాన్ని వదిలేసి, ఇంటికి వచ్చాడు. కుటుంబానికి 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉండటంతో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేస్తున్నాడు. డ్రిప్ ద్వారా మొక్కజొన్న పండిస్తున్నట్లు పేర్కొన్నాడు. వ్యవసాయంలో ఆనందం ఉందని, పనుల కోసం ట్రాక్టర్, హార్వెస్టర్ కొనుగోలు చేసినట్లు తెలిపాడు.

సేంద్రియ సాగు.. పశువుల పెంపకం

చొప్పదండి: పెద్దకుర్మపల్లికి చెందిన మావురం మల్లికార్జున్ రెడ్డి బీటెక్ చదివాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ నెలకు రూ.లక్ష సంపాదించినా తృప్తినివ్వలేదు. రసాయనాలతో ఆహారం కలుషితమవడాన్ని గుర్తించి, సేంద్రియ వ్యవసాయం చేయాలనుకున్నాడు. విషయాన్ని ఎంసీఏ చదివి, ప్రైవేటు ఉద్యోగం చేసే తన భార్య సంధ్యకు చెప్పడంతో సరే అంది. ఇద్దరూ కలిసి స్వగ్రామం చేరుకున్నారు. 15 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తూ పశువులు, బావిలో చేపల పెంపకం చేపడుతున్నారు. మల్లికార్జున్‌రెడ్డి జాతీయ ఉత్తమ రైతు అవార్డు అందుకున్నాడు. గతేడాది ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. ప్రస్తుతం 100 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో పంటలు పండించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపాడు. సేంద్రియ వ్యవసాయంలో రైతులకు లాభాలు మెండుగా ఉంటాయని, భవిష్యత్‌లో మన దేశం ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన పంటలు పండించాలని సూచిస్తున్నాడు.



మొక్కజొన్న చేనులో మల్లికార్జున్‌రెడ్డి



ఉస్మానియా వర్సిటీ



తెలంగాణ వర్సిటీ



శాతవాహన వర్సిటీ

మనోళ్లు..వీసీలు

8లో ▸

- సాధారణ స్థాయి నుంచి ఉన్నత పదవుల్లోకి..
- వైస్ ఛాన్స్‌లర్లుగా యూనివర్సిటీల పాలనలో ప్రత్యేక ముద్ర
- ఆదర్శంగా నిలిచిన ఉమ్మడి జిల్లావాసులు

ప్రజా పోరాటాలకు పెట్టింది పేరైన సిరిసిల్ల కాలానుగుణంగా శరవేగంగా పురోగమిస్తున్న జిల్లా కేంద్రం. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్ననాటి నుంచే ప్రపంచం గుర్తించిన మేధావులకు జన్మనిచ్చిన నేల. పేద, వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన ఎంతోమంది ఉన్నత చదువులు చదివారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో ప్రొఫెసర్లుగా పని చేశారు. ఉస్మానియా, అంబేడ్కర్, తెలుగు, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీలకు వీసీలుగా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. వీరితోపాటు పలువురు ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు కూడా ఉన్నారు. –సిరిసిల్ల కల్చరల్

న్యూస్‌రీల్

సర్వే సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల: సమగ్ర ఇంటింటి కుటుంబ(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. జిల్లాలో పూర్తయిన కుటుంబాల సర్వే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు మాస్టర్ ట్రెయినర్లకు కలెక్టరేట్‌లో శనివారం శిక్షణనిచ్చారు. ప్రతీ మండలానికి ఇద్దరు, మున్సిపాలిటీ పరిధిలో నలుగురు చొప్పున మొత్తం 28 మంది మాస్టర్ ట్రెయినర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. మాస్టర్ ట్రెయినర్లు మండల కేంద్రాలు, జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన 480 మంది ఆపరేటర్లకు డాటా ఎంట్రీపై శిక్షణ ఇచ్చారని వివరించారు. శిక్షణ పొందిన ఆపరేటర్లు డాటా ఎంట్రీని జిల్లాలో ప్రారంభించారని ఖీమ్యానాయక్ తెలిపారు. జిల్లాలో శిక్షణ పొందిన 28 మంది మాస్టర్ ట్రెయినర్ల పర్యవేక్షణలో డేటా ఎంట్రీ సాగుతుందన్నారు. సర్వే సమాచారం ఆన్‌లైన్ చేసే విధానంపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- తంగళ్లపల్లి ఠాణా తనిఖీ



సిరిసిల్లక్రైం: కేసుల దర్యాప్తులో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పలు రికార్డులు తనిఖీ చేసి మాట్లాడారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది 100 డయల్ కాల్స్‌కు తక్షణమే స్పందించాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో ఠాణా పరిధిలోని రౌడీషీటర్లను నిత్యం తనిఖీ చేయాలన్నారు. సీఐ మొగిలి, ఎస్సై రామ్మోహన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం నమోదవుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. కొత్త నంబర్ల నుంచి వచ్చే కాల్స్, లింక్స్, ఏపీకే మెసేజ్‌లపై జాగ్రత్త వహించాలన్నారు. పోలీస్ యూనిఫామ్‌తో వీడియోకాల్స్ చేసి డిజిటల్ అరెస్ట్ అంటే స్పందించొద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి కాల్‌చేయాలని సూచించారు. సోషల్ మీడియా అకౌంట్స్‌కు ప్రొఫైల్ లాక్ పెట్టుకోవాలని సూచించారు.

ఇండోనేషియాలో సుందరకాండ

- ఇండోనేషియా గడ్డపై 'కిష్కింధకాండ' ప్రదర్శన
- గంటన్నరపాటు మంత్రముగ్ధులను చేసిన కార్యక్రమం
- దేశవిదేశీయులను ఆకట్టుకునేలా 'మన రామాయణం'

సిరిసిల్ల: హిందూ మహాసముద్రతీరంలో రామాయణ దృశ్యకావ్యం ఆకట్టుకుంది. ఇందులో ఏముందీ ప్రత్యేకత అనుకునేరు. అవును ప్రత్యేకతే ఉంది. హిందూ మహాసముద్ర తీరంలోనే అయినా మన దేశంలో కాదు. ముస్లిం జనాభా అధికంగా నివసించే ఇండోనేషియాలో రామాయణంలోని కాండాలను ప్రదర్శించడమే ప్రత్యేకత. దక్షిణ ఇండోనేషియాలోని కుట పట్టణం హిందూ మహాసముద్రతీరాన్ని ఆనుకుని ఉంటుంది. సముద్రం నుంచి చల్లనిగాలులు వీస్తుండగా.. సుందరకాండ, కిష్కింధకాండాల ప్రదర్శన కుట పట్టణానికి ఇటీవల సిరిసిల్ల నుంచి వెళ్లిన టూరిస్టులకు ప్రత్యేక అనుభూతినిచ్చింది.



సీతారాముల పట్టాభిషేకం



వానర సైన్యం నృత్యరూపకం

కరతాల ధ్వనుల మధ్య

హనుమంతుడు లంకకు వెళ్లి.. సీతమ్మ జాడను కనుగొనుట నుంచి వానర(కోతులు)సేనతో రామలక్ష్మణులు లంకలోకి వెళ్లి.. రావణ సంహారం చేసి సీతమ్మతో పట్టాభిషేకం జరిగే వరకు ప్రతీ దృశ్యం కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కళాకారుల నృత్యాలు.. లంక దహనం.. రావణ సంహారం భారీ లైటింగ్స్ మధ్య ఆకట్టుకున్నాయి. వెనకటి వీధి నాటకమే అయినా.. ఆధునికతను జోడిస్తూ.. అద్భుతమైన సెట్టింగులు.. మైక్‌సిస్టమ్స్‌తో ఓపెన్ థియేటర్‌లో వేలాది మంది విదేశీయులు వీక్షిస్తుండగా ప్రదర్శించడం భారతీయులుగా అక్కడికి వెళ్లిన టూరిస్టులు గర్వపడేలా చేశాయి. మన భాష కాకున్నా అర్థవంతమైన స్క్రీన్‌ప్లేతో రామాయణకావ్యం ప్రదర్శన కట్టిపడేసింది. ఇండోనేషియా ముస్లిం దేశం.. అక్కడ హిందువులు మైనార్టీలు.. కానీ ఆ దేశ కూడళ్లలో మహాభారత దృశ్యాలు.. రామాయణ చిత్రాలు దర్శనమిచ్చాయి.

చాక్‌పీస్ చేతపట్టి.. పాఠాలు బోధించి

గంభీరావుపేట(సిరిసిల్ల): నిత్యం ఫైళ్ల పరిశీలన, ప్రజాసమస్యలు పరిష్కరించడంలో నిమగ్నమయ్యే జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బడిబాట పట్టి టీచర్‌లా మారారు. గంభీరావుపేటలోని పలు పాఠశాలలను శనివారం సందర్శించారు. చాక్‌పీస్ చేతపట్టి, విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. గంభీరావుపేట కేజీ టు పీజీ, దమ్మన్నపేట మోడల్‌స్కూల్‌ను తనిఖీ చేశారు.



అభివృద్ధే మా ధ్యేయం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం

గంభీరావుపేట(సిరిసిల్ల)/వేములవాడఅర్బన్: అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండలంలో దాదాపు రూ.23కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని లింగన్నపేట నుంచి కోరుట్లపేట వరకు కేంద్రం నిధులు రూ.15కోట్లతో నిర్మించిన డబుల్‌రోడ్డును, మల్లారెడ్డిపేట, గంభీరావుపేట మధ్య మానేరువాగుపై రూ.8.30కోట్లతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జికి ప్రారంభోత్సవం చేశారు. అంతకుముందు మల్లారెడ్డిపేటలోని పురాతన శ్రీవీరాంజనేయస్వామి క్షేత్రంలో, గంభీరావుపేట శివారులోని తాళ్ల ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. బీజేపీ నాయకులు రాణిరుద్రమ, కొక్కు దేవేందర్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మండలాధ్యక్షుడు గంట అశోక్, నాయకులు రాజేందర్‌రెడ్డి, దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, కృష్ణకాంత్ యాదవ్, మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, నరేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంకెపల్లిలో సీసీరోడ్లు ప్రారంభం

వేములవాడ మండలం సంకెపల్లిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.14లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి గ్రామపంచాయతీలకు, మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. వేములవాడ ఆలయాన్ని ప్రసాదం స్కీమ్‌లో చేర్చుతున్నామని ప్రకటించగానే.. సీఎం రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల హామీ ఆరుగ్యారంటీల్లో ఎన్ని అమలవుతున్నాయో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. రాజన్న ఆలయానికి ప్రసాదం స్కీమ్ వస్తుందని స్పష్టం చేశారు. గాయపడిని పార్టీ సంకెపల్లి గ్రామాధ్యక్షుడు నాగుల సురేశ్‌ను పరామర్శించారు. వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ బుర్ర లహరిక, బుర్ర శేఖర్, బండ మల్లేశం, రాజిరెడ్డి, జింక అనిల్, కనకరాజు, నిఖిల్, భాను, అరవింద్, పూర్ణచందర్ ఉన్నారు.



రోడ్డు ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కొవ్వొత్తులతో నివాళి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో రాక్షసపాలన నడుస్తోందని తాజామాజీ సర్పంచుల జేఏసీ కన్వీనర్ అక్కెనపల్లి కరుణాకర్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. శనివారం రాత్రి సిరిసిల్లలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తాలో నివాళి అర్పించారు. జేఏసీ నాయకులు దుమ్మ అంజయ్య, చాకలి రమేశ్, బొజ్జం మల్లేశం, వెన్నమనేని వంశీకృష్ణ, గున్నాల లక్ష్మణ్, సిరికొండ శ్రీనివాస్, రాచూరి రాజేశ్, రవినాయక్, మంతెన సంతోష్, సోషల్ మీడియా కన్వీనర్ ఆరే మహేందర్, గంగాధర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో కొవ్వొత్తులతో నివాళి

ఎల్లంపల్లి కాల్వపనులు పూర్తి చేస్తాం

- గత ప్రభుత్వ అసమర్థతతోనే పెండింగ్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): ఎల్లంపల్లి ప్రాజెక్టు కాల్వ పనులు పూర్తిచేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని దేవునితండాలో శనివారం ఎల్లంపల్లి కాల్వ పనులకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ప్రొక్లెయిన్ నడిపి పనులు ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అసమర్థతతోనే ఎల్లంపల్లి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. వైఎస్సార్ బతికి ఉంటే ఈ పనులు ఎప్పుడో పూర్తయ్యేవన్నారు. కోనరావుపేట మండలం లచ్చపేటతండా వరకు కాల్వ పూర్తి చేసి సనుగుల ఎర్ర,పటేల్ చెరువును నింపుతామన్నారు. నియోజకవర్గంలోని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.325కోట్లను బడ్జెట్‌లో కేటాయించారని తెలిపారు. కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ పనుల పూర్తికి రూ.20కోట్ల మంజూరు కోసం నీటిపారుదలశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కలికోట సూరమ్మ చెరువు, సనుగుల పెండింగ్ పనులను ప్రారంభించినట్లు వివరించారు. చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జెడ్పీటీసీలు నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి, సనుగుల సింగిల్‌విండో మాజీ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి, ఎల్లంపల్లి ప్రాజెక్టు డీఈ రఫీ, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఉపాధ్యక్షులు బొజ్జ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ప్రొక్లెయిన్‌తో కాల్వ పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

క్లుప్తంగా

ఒకరికి ఐదేళ్ల జైలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి ఎన్.ప్రేమలత శనివారం తీర్పు వెల్లడించారు. బాధిత కుటుంబానికి రూ.50వేలు పరిహారం చెక్కు అందించారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన బొమ్మెర అంజయ్య(52)కు చెందిన పెంపుడు కుక్క, సమీపంలో ఉంటున్న రంగు నాగరాజు ఇంటిముందర అపరిశుభ్రం చేసింది. దీంతో కోపోద్రిక్తుడైన నాగరాజు 2020 ఆగస్టు 27న అంజయ్యపై దాడిచేయడంతో మృతిచెందాడు. మృతుని కుమారుడు భీంచంద్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి ప్రేమలత శనివారం తీర్పునిచ్చారు. నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.2వేలు జరిమానా విధించారు. మృతుని భార్య బొమ్మెర జ్యోతికి రూ.50వేల చెక్కును పరిహారంగా అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్కాపూర్‌లో 13 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకొని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ తెలిపారు. పోలీసులు మల్కాపూర్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన అనిల్ బైక్‌పై బ్యాగ్‌తో వస్తుండగా తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈక్రమంలో అనిల్‌ను విచారించగా చుట్టుపక్కల గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యం కొని, పూడూర్‌కు చెందిన కృష్ణ, తిప్పాయిపల్లి ప్రభాకర్‌రెడ్డి, పూడూర్ ప్రభాకర్‌లకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. ఈమేరకు తనిఖీలు చేయగా వారి వద్ద 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం దొరికినట్లు వివరించారు. బియ్యం, బైక్‌ను స్వాధీనం చేసుకొని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

27న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్నకు భక్తులు హుండీలలో సమర్పించుకున్న కట్నాలు, కానుకలను ఈనెల 27న లెక్కించనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

శబరిమలకు రెండు బస్సులు

- సిరిసిల్ల డీఎం ప్రకాశ్‌రావు

సిరిసిల్లటౌన్: అయ్యప్ప భక్తుల కోసం సిరిసిల్ల డిపో నుంచి శబరిమలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు శనివారం ప్రకటనలో తెలిపారు. బస్సు అద్దెను గతేడాది కిలోమీటర్‌కు రూ.65 నుంచి ప్రస్తుతం రూ.59కి తగ్గించినట్లు పేర్కొన్నారు.

బల్లాపూర్ విజేతకు రాజన్న ప్రసాదం



వేములవాడ: మహారాష్ట్ర ఎన్నికల్లో బల్లాపూర్ బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించిన సుధీర్ ముదుగంటివార్‌కు రాజన్న ప్రసాదాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అందించారు. చంద్రాపూర్‌లో శనివారం కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.

మనోళ్లు.. వీసీలు

సండే స్పెషల్

జర్మనీలో ప్రొఫెసర్.. రమేశ్‌బాబు



రమేశ్‌బాబు

చెన్నమనేని రమేశ్‌బాబు మాజీ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రావు కుమారుడు. ఉన్నత విద్యాభ్యాసం కోసం జర్మనీ వెళ్లారు. లీప్‌జిగ్‌లో వ్యవసాయ రంగంలో పీజీ చేసి, అనంతరం హంబోల్ట్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందారు. అక్కడే ప్రొఫెసర్‌గా పని చేసి, 2009లో వేములవాడ వచ్చి, తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత టీఆర్‌ఎస్ నుంచి 2010, 2014, 2018లో వరుసగా శాసనసభ్యుడిగా విజయం సాధించారు.

ఎస్‌యూ తొలి వీసీ.. ఇక్బాల్ అలీ



ఇక్బాల్ అలీ

శాతవాహన యూనివర్సిటీ తొలి వీసీ ప్రొఫెసర్ మహమ్మద్ ఇక్బాల్ అలీ. ఆయన స్వగ్రామం తంగళ్లపల్లి మండలంలోని తాడూరు. 1954 ఆగస్టు 10న జన్మించారు. ఉద్యోగ రీత్యా వరంగల్, కరీంనగర్‌లో స్థిరపడ్డారు. కరీంనగర్‌లోని మంకమ్మతోట ధన్గర్‌వాడీ హైస్కూల్లో పదోతరగతి, ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. 14 ఏళ్లు ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా, మరో 19 ఏళ్లు కాకతీయ వర్సిటీలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. కేయూ ఎకనామిక్స్ విభాగాధిపతిగా, పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన అయన అనేక ప్రామాణిక పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. ఔత్సాహిక పరిశోధకులకు మార్గనిర్దేశం చేశారు.


లింగమూర్తి, వీరారెడ్డి, అనంతస్వామి..



లింగమూర్తి



వీరారెడ్డి



అనంతస్వామి

హుస్నాబాద్‌కు చెందిన ప్రొ. ఎస్.లింగమూర్తి కాకతీయ, తెలంగాణ వర్సిటీలకు వీసీగా పని చేశారు. శాతవాహనకు వీసీగా చేసిన కడారు వీరారెడ్డిది కొడిమ్యాల మండలం కట్టకింది గోపాల్‌రావుపల్లి. తల్లిదండ్రులు యశోద-పెద్దమల్లారెడ్డి. వ్యవసాయ కుటుంబం. కరీంనగర్‌కు చెందిన ప్రొ.జె.అనంతస్వామి పేద కుటుంబంలో పుట్టారు. ఉస్మానియా వర్సిటీకి వీసీగా చేశారు.

సెంట్రల్ వర్సిటీ.. హనుమంతరావు



హనుమంతరావు

కోనరావుపేట మండలం నాగారానికి చెందిన డాక్టర్ చెన్నమనేని హనుమంతరావు 1929 మే 15న జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ చికాగో నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఈయన క్లాస్‌మేట్. ఆర్థిక సంస్కరణలపై అధ్యయనం చేశారు. ప్రణాళికా సంఘం సభ్యుడిగా, నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యుడిగా, గవర్నర్‌తో ప్రమేయం లేకుండా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి 2012–14 వరకు చాన్స్‌లర్‌గా పని చేశారు. 2014లో రాజీవ్‌గాంధీ సద్భావన పురస్కారం అందుకున్నారు. భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. రిజర్వ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్‌గా సేవలందించారు. మాజీ ఎమ్మెల్యే, దివంగత సీహెచ్.రాజేశ్వర్‌రావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్ రావు ఈయన సోదరులే.

సార్వత్రిక విద్య.. రాంరెడ్డి



రాంరెడ్డి

చందుర్తి మండలంలోని బండపెల్లికి చెందిన గడ్డం రాంరెడ్డి 1929 డిసెంబర్ 4న జన్మించారు. దేశంలో సార్వత్రిక విద్యను ప్రవేశపెట్టిన మేధావి. ఎంఏ పొలిటికల్ సైన్స్‌తోపాటు పీహెచ్‌డీ చేశారు. 1977 వరకు ఉస్మానియాలో ప్రొఫెసర్‌గా పని చేశారు. ఈయన నివేదిక ఆధారంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లో 1982లో దేశంలోనే తొలి సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని బీఆర్.అంబేడ్కర్ పేరిట స్థాపించింది. దీనికి రాంరెడ్డి తొలి వీసీ. అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీని స్థాపించి, ఆయననే వీసీగా నియమించింది. అనంతరం యూజీసీ చైర్మన్‌గా పని చేశారు. బంగ్లాదేశ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ యూనివర్సిటీకి సలహాదారుగా నియమితులయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ దూరవిద్య విభాగానికి ఆయన పేరే పెట్టారు. జూలై 2, 1995లో లండన్‌లో మరణించారు.

అంబేడ్కర్, తెలుగు వర్సిటీలు.. సినారె



నారాయణరెడ్డి

చందుర్తి మండలం హన్మాజీపేటకు చెందిన డాక్టర్ సి.నారాయణరెడ్డి 1931 జూలై 29న జన్మించారు. తెలుగు సాహిత్య ప్రక్రియలన్నింటిలో రాణించి, మహాకవిగా ఎదిగారు. పద్మశ్రీ, పద్మభూషణ్, కళాప్రపూర్ణ, కేంద్ర సాహిత్య అకాడమీతోపాటు ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ అవార్డు అందుకున్నారు. ఉస్మానియాలో ఎంఏ తెలుగు పూర్తయ్యాక సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, నిజాం కాలేజీ, ఉస్మానియా వర్సిటీలో ఆచార్యుడిగా పని చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి వీసీగా బాధ్యతలు నిర్వర్తించారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, సాంస్కృతిక మండలి అధ్యక్షుడిగా, సాంస్కృతిక వ్యవహారాల సలహాదారుగా పని చేశారు. 1997లో రాజ్యసభ సభ్యుడిగా ప్రజాసేవలో తరించారు.

శాతవాహన.. మల్లేశం



మల్లేశం

సినారె స్వగ్రామం హన్మాజీపేటలో సంకసాల పోచయ్య-రాములమ్మ దంపతులకు రెండో సంతానంగా జన్మించారు ప్రొఫెసర్ మల్లేశం. సిరిసిల్ల సోషల్ రెసిడెన్షియల్ హాస్టల్లో ఉండి, 10వ తరగతి పూర్తి చేశారు. బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన సోదరుడు రాములు పంపిన డబ్బుతో హైదరాబాద్‌లో ఇంటర్, బీఎస్సీ, పీజీ చదివారు. ఉస్మానియాలో ఎంఫిల్, ఇంటర్నేషనల్ జర్మనీ ఫెలోషిప్‌తో జర్మనీ బెర్లిన్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని ఆర్ట్స్, నిజాం, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీల్లో ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అనంతరం ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గానూ సేవలందించారు. 2021 నుంచి మూడేళ్లపాటు శాతవాహన వర్సిటీ వీసీగా కొనసాగారు.

తెలుగు వర్సిటీ.. కిషన్‌రావు



కిషన్‌రావు

ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు స్వగ్రామం వరంగల్ అర్బన్ జిల్లా పరిధి ఎల్కతుర్తి మండలం జీలుగుల గ్రామం. కానీ, ఆయన ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో తన మేనమామ ఇంట్లో జన్మించారు. బాల్యంలో కొంతకాలం ఇక్కడే విద్యాభ్యాసం చేశారు. అనంతరం తల్లిదండ్రుల వద్ద పెరిగారు. ఉస్మానియా వర్సిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి వీసీగా సేవలందించారు.

తెలుగు వర్సిటీ.. భూమయ్య



భూమయ్య

అనుమాండ్ల భూమయ్య చొప్పదండిలో సాధారణ చేనేత కుటుంబంలో పుట్టారు. తల్లిదండ్రులు శాంతమ్మ-లస్మయ్య. ఏడుగురు తోబుట్టువుల్లో ఆయన మూడో సంతానం. భూమయ్య 11వ తరగతి వరకు చొప్పదండిలో చదివారు. హెడ్మాస్టర్ జనార్దన్‌రెడ్డి ప్రోత్సాహంతో చదువు కొనసాగించారు. జగిత్యాలలో డిగ్రీ చదివే రోజుల్లో కోవెల సంపత్‌కుమారాచార్య ప్రోత్సాహంతో తెలుగుపై ఆసక్తి పెంచుకొని, ఎంఏ పూర్తి చేశారు. తెలుగు వర్సిటీకి వీసీగా సేవలందించారు.

టీఎంసీ మాజీ రిజిస్ట్రార్.. హనుమంతరావు



హనుమంతరావు

చందుర్తి మండలంలోని మల్యాలకు చెందిన చెన్నమనేని నారాయణరావు-రంగనాయకమ్మ దంపతులకు మారుడు హనుమంతరావు. సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో 1978 నుంచి రెండేళ్లపాటు డాక్టర్‌గా సేవలందించారు. వేములవా డ, చందుర్తి, ఎల్కతుర్తి, కరీంనగర్‌లలో సివిల్ సర్జన్‌గా పని చేశారు. 800 పేజీల మహాభారతాన్ని 150 పేజీలకు కుదించి, రచించడంతో పాటు అందరికీ ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వికాస తరంగిణిలో సభ్యుడిగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయనను తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్(టీఎంసీ)కు రిజిస్ట్రార్‌గా నియమించింది.

కల్యాణకట్టలో దుర్వాసన



బస్తాల్లో పేరుకుపోయిన తలనీలాలు

వేములవాడ: కల్యాణకట్టలో తలనీలాల నుంచి వస్తున్న దుర్వాసనతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం భక్తులు సమర్పించే తలనీలాలను సేకరించి భద్రపరచాల్సిన సదరు కాంట్రాక్టర్ వాటిని అక్కడే వదిలేస్తుండడంతో సంచుల్లో నుంచి దుర్వాసన వస్తోందని భక్తులు ముక్కు మూసుకుంటున్నారు. కొన్ని నెలలుగా సదరు కాంట్రాక్టర్ తలనీలాలు సేకరించకపోవడంతో ఎత్త ఎత్తున పేరుకుపోయాయి. సంచుల్లో నింపి అక్కడే పెడుతుండడంతో నీటి తడి తగిలి దుర్వాసన వస్తుంది. వెంటనే తలనీలాల సంచులను ఇక్కడి నుంచి తరలించాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఈవో వినోద్‌రెడ్డిని వివరణ కోరగా సంబంధిత అధికారులకు తెలియజేసి తలనీలాల సంచులను గదిలో భద్రపరచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే సదరు కాంట్రాక్టర్ ఆలయానికి డబ్బులు చెల్లించడం లేదని తెలిసింది.

ఆటలతో మానసికోల్లాసం

- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం



దివ్యాంగులతో చెస్ ఆడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల: ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని, ఆటల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు ఉంటాయని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. సిరిసిల్లలోని కళాశాల మైదానంలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. జిల్లా దివ్యాంగుల సమితి నాయకులు మామిడాల నరేశ్, మాదాసు రాజేశ్‌బాబు, వినయ్, రాము, శ్రీనివాస్ పర్శురాములు, సీడీపీవోలు ఉమారాణి, సుచరిత, డీహబ్ కోఆర్డినేటర్ రోజా, సఖీ అడ్మిన్ పద్మ, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సంతోష్, పోషణ అభియాన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

మాలల సత్తా చాటుదాం

- ఎస్సీ వర్గీకరణలో కులవివక్ష చూపారు
- పొలిటికల్ పార్టీల్లో చిన్నచూపు సరికాదు
- 30లక్షల మాలలు ఏకతాటిపైకి రావాలి
- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి
- సిరిసిల్లలో మాలల ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

సిరిసిల్లటౌన్: రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రంలోని 30 లక్షల మంది కలిసి సత్తా చాటుదామని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. సిరిసిల్లలో శనివారం నిర్వహించిన మాలలు, ఉపకులాల ఆత్మగౌరవ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చిన జస్టిస్ చంద్రచూడ్ కుల వివక్ష చూపారన్నారు. మాలల హక్కుల సాధనకు అందరం ఏకంకావాలన్నారు. మాలలు ఐక్యంగా ముందుకు నడవాల్సిన సమయం వచ్చిందన్నారు. డిసెంబర్ 1న సికింద్రాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభకు సొంత ఖర్చులతో రావాలని కోరారు.

బాబును ప్రశ్నిసే...మంత్రి పదవి తీసేసిండ్రు

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం కేబినెట్‌లో పనిచేసిన సమయంలోనే చంద్రబాబును మాలల ఆత్మగౌరవంపై ప్రశ్నించానని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య పేర్కొన్నారు. ఇప్పుడు కూడా అదే చంద్రబాబు కేంద్రంలోని బీజేపీ సర్కారుతో కలిసి మాలలు, ఉపకులాలకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలలు.. దళిత వర్గాల్లోని ఇతర కులాల హక్కులను దోచుకున్నారన్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు సిరిసిల్లలో మాలమహానాడు ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, రాష్ట్ర, జాతీయ నాయకులు కె.వేణుగోపాలస్వామి, మాందాల భాస్కర్, రెంజర్ల రాజేశ్, రాగుల రాములు, గొట్టె రుక్మిణి, సిరిగిరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాలల హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం

ముస్తాబాద్(సిరిసిల్ల): మాలలు తమ హక్కుల పరిరక్షణకు కోసం ఐక్యంగా ఉద్యమించాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కోరారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో శనివారం సమావేశమయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ ఎంపీటీసీ లలిత, మాల మహానాడు మండల అధ్యక్షుడు జంగ భూమరాజ్, బండ రాజు, దేవరాజు, జక్కుల యాదగిరి, క్రాంతి, కృష్ణ, కరుణాకర్, స్వామి, నరేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాడు తండ్రి... నేడు తల్లి మృతి



కోనరావుపేట(వేములవాడ): మండలంలోని జైసేవాలాల్ ఊరుతండా(నిమ్మపల్లి)కు చెందిన ఇస్లావత్ భాస్కర్-భారతి దంపతులకు కూతురు నవ్యశ్రీ. భాస్కర్ హోంగార్డుగా పనిచేస్తూ అనారోగ్యానికి గురై నాలుగేళ్ల క్రితం మృతిచెందాడు. నవ్యశ్రీ తల్లి భారతితో కలిసి నిమ్మపల్లిలో ఉంటూ కోనరావుపేట మోడల్‌స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. తల్లి భారతి కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై శుక్రవారం రాత్రి మృతిచెందింది. దీంతో నవ్యశ్రీ అనాథగా మిగిలింది. నవ్యశ్రీని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ ఇస్లావత్ రాములు నాయక్, గ్రామస్తులు కోరుతున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

సిరిసిల్లటౌన్: కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామని ఏఐఎఫ్టీయూ న్యూ జాతీయ అధ్యక్షుడు కామ్రేడ్ గుర్రం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో శనివారం నిర్వహించిన జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని చేనేత, పవర్‌లూమ్, సైజింగ్, డయింగ్ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఫలితంగా వస్త్రపరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడంతో కార్మికుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతుందన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈనెల 26న జిల్లాలోని అన్ని వర్గాల కార్మికులు, రైతులు నిరసనలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి దశరథం, వొల్లాల కిశోర్, ఎలిగేటి రాము, కూరపాటి సతీశ్, మచ్చ అనసూర్య, బాముండ్ల రవీందర్, గుజ్జ దేవదాసు, సత్తయ్య, రాజేశం, దాసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఇష్టంతో చదవాలి'

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ కోరారు. స్థానిక జూనియర్ కాలేజీని శనివారం సందర్శించారు. కళాశాల ఇన్‌చార్జి సత్యనారాయణ, అధ్యాపకులు వాసరవేణి పరశురాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, నీరటి విష్ణుప్రసాద్, రామంచి గీత, చిలుక ప్రవళిక, కొడిముంజ సాగర్, సిబ్బంది విమల్‌కుమార్, షాహిన సుల్తానా ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మొగిలి తెలిపారు. మండలంలోని ముస్కానిపేటలో గుండారం గ్రామానికి చెందిన మహ్మద్ అల్తాహాద్ గంజాయి విక్రయించేందుకు యత్నిస్తుండగా ఎస్సై పట్టుకున్నారన్నారు. అతని నుంచి 110 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

బోయినపల్లి: మండలంలోని జగ్గారావుపల్లికి చెందిన దొంతరవేని ఎల్లవ్వ అదృశ్యమైనట్లు ఎస్సై పృథ్వీధర్ శనివారం తెలిపారు. ఈనెల 22న ఎల్లవ్వ అదృశ్యమైనట్లు ఆమె కుమారుడు కనుకరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హోటల్ దగ్ధం

- రోడ్డున పడిన నేతకార్మిక కుటుంబం
- కృష్ణవేణిని వెంటాడుతున్న కష్టాలు



హోటల్‌కు అంటుకున్న మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సిరిసిల్ల: కొందరి కష్టాలు చూస్తే.. పగవారికైనా రావద్దనిపిస్తుంది. ఎదిగిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే.. భర్త అప్పుల బాధలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రోడ్డు పక్కన హోటల్ నడుపుతూ కష్టాలను ఎదురీదుతున్న సిరిసిల్లకు చెందిన కృష్ణవేణిని కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆమె జీవనోపాధికి భరోసానిస్తున్న హోటల్ శనివారం దగ్ధమైంది. దీంతో ఆమె రోడ్డున పడింది. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన వడ్నాల కృష్ణవేణి, పరమేశ్వర్ దంపతులకు ఇద్దరు పిల్లలు. శివకుమార్, ప్రియాంక, పరమేశ్వర్ సాంచాలు నడుపుతూ.. కృష్ణవేణి బీడీలు చేస్తుండేది. నాలుగేళ్ల క్రితం హైదరాబాద్ దుర్గంచెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడుకు శివకుమార్ మరణించాడు. బీటెక్ పూర్తి చేసి కుటుంబానికి ఆసరా అవుతాడనుకున్న కొడుకు మరణంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. కొడుకు మరణించిన మానసిక వేదన... అప్పుల బాధలతో 10 నెలల క్రితం పరమేశ్వర్ చంద్రంపేట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు, భర్త మరణంతో కూతురును పోషించే భారం కృష్ణవేణిపై పడింది.

బతుకుదెరువు బుగ్గి

స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద కృష్ణవేణి హోటల్ నిర్వహిస్తుంది. కొబ్బరి బొండాలు అమ్ముతూ.. కూతురు ప్రియాంకను చదివిస్తోంది. శనివారం ఉదయం ఎప్పటిలాగే హోటల్ తీసేందుకు కృష్ణవేణి రాగా.. హోటల్ డబ్బా కాలిపోవడం కనిపించింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. హోటల్ సామగ్రి, కొబ్బరి బొండాలు, సామగ్రి బుగ్గిపాలయ్యాయి. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగింది. అప్పటికే అప్పుల బాధల్లో ఉన్న కృష్ణవేణిని హోటల్ కాలిపోవడంతో కన్నీటి పర్యంతమైంది. విధి పగబట్టినట్లుగా నేతకార్మిక కుటుంబాన్ని ఆగం చేస్తుంది. కలెక్టర్, మానవతావాదులు స్పందించి బాధితురాలు కృష్ణవేణిను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రమాద కారకుడిని ఎలా వదిలేస్తారు ?

- సిరిసిల్లలో రాజేశ్వర్‌రావునగర్ వాసుల ధర్నా
- పోలీసుల తీరుపై పెల్లుబికిన ఆగ్రహం



రమేశ్(ఫైల్)

సిరిసిల్లటౌన్/గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం రాజేశ్వరావునగర్‌లో రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో పోలీసుల తీరుపై బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రమాదంలో మృతిచెందిన చల్ల రమేశ్(34) బంధువులు, గ్రామస్తులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ సిరిసిల్లలోని అంబేడ్కర్‌చౌరస్తాలో శనివారం రాస్తారోకో చేపట్టారు. గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్, మల్లుపల్లి గ్రామాల మధ్య శుక్రవారం అర్ధరాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో చల్ల రమేశ్ మృతిచెందాడు. మృతుడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి తల్లి రామవ్వ, భార్య రజిత, కూతుళ్లు మేనక, రిషిక, కొడుకు రిషి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



అంబేడ్కర్ చౌరస్తాలో మృతుడి బంధువుల ధర్నా

నిందితుడిని ఎలా వదిలేస్తారు?

రమేశ్ మృతిచెందినా ప్రమాదానికి కారణమైన వ్యక్తిని ఎలా వదిలేస్తారని ప్రశ్నిస్తూ మృతుడి బంధువులు, గ్రామస్తులు సిరిసిల్లలో ధర్నాకు దిగారు. పోలీసుల తీరు సరిగ్గా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గంటకుపైగా బైఠాయించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ వచ్చి బాధిత కుటుంబ సభ్యులు, ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు.

జిల్లాకు శిక్షణ అధికారులు



బద్దెనపల్లికి చేరిన ట్రెయినీ అధికారులు

సిరిసిల్లఎడ్యుకేషన్/వేములవాడఅర్బన్: శిక్షణలో భాగంగా ట్రెయినీ ఐఏఎస్ అధికారులు శనివారం జిల్లాకు వచ్చారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి ఒక బృందం, వేములవాడ మండలం చీర్లవంచ గ్రామానికి మరో బృందంగా వచ్చారు. ఈనెల 27 వరకు గ్రామంలో అమలవుతున్న పథకాలను పరిశీలించనున్నారు. చీర్లవంచకు ట్రెయినీ అధికారులు గౌరవ్‌గార్గ్, రిషాబ్, రెజ్జురాణా, శివాన్షి శుక్లా తదితరులు ఉన్నారు. వారి వెంట ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర ఉన్నారు.

నూతన తరగతి గది ప్రారంభం



గదిని ప్రారంభిస్తున్న సేవా సమితి సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లోని హైస్కూల్‌లో నారాయణపూర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మించిన నూతన తరగతి గదిని శనివారం ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ మాట్లాడుతూ పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.10వేల నగదు ప్రోత్సాహకంగా అందిస్తామన్నారు. సేవా సమితి అధ్యక్షుడు మోతె దేవిరెడ్డి, ముఖ్య సలహాదారులు పాత లింగాలు, షేక్ గౌస్, సుదర్శన్, లద్దునూరి తిరుపతి, నిమ్మ నారాయణరెడ్డి, టి.సుధాకర్, కిషన్‌రావు, దుబ్బ విశ్వనాథం, సత్యం, ఎల్లారెడ్డిపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మనోహరాచారి, హైస్కూల్ హెచ్‌ఎం ఆకునూరి చంద్రశేఖర్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం దేవరాజు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

సిరిసిల్ల కల్చరల్: సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యశోద ఆస్పత్రి జీర్ణ వ్యవస్థ వ్యాధుల నిపుణుడు డాక్టర్ శృతిసాగర్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడారు. సమయపాలన లేని ఆహార నియమాలు, ఫాస్ట్ ఫుడ్, జీర్ణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల సంజీవ్‌రెడ్డి, తంగళ్లపల్లి వెంకటి, సీనియర్ న్యాయవాదులు సబ్బని రవీందర్, బి.రవీందర్ రావు, కుడిక్యాల రాజేశ్, కిషన్ పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ అందించాలి

- టెస్కో జీఎం అశోక్‌రావుకు వినతి

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలకు సంబంధించి నేతన్నలకు రావాల్సిన యారన్ సబ్సిడీ డబ్బులు వెంటనే అందించాలని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని టెస్కో జీఎం అశోక్‌రావును సీఐటీయూ ఆధ్వర్యంలో కలిసి మాట్లాడారు. 2022, 2023 సంవత్సరాలలో సబ్సిడీ డబ్బులు పెండింగ్‌లో ఉన్న వారికి వెంటనే అందించాలని కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.